మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసిన దేశబోయిని నర్సింలు


గవర్నర్‌కు పుష్పగుచ్ఛంఅందజేస్తున్న నర్సింలు

**గజ్వేల్, జనవరి 1 (ప్రభాతవార్త):** ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్‌లోని లోక్ భవన్ లో రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను గురువారం జాతీయ యువజన అవార్డు గ్రహీత, యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దేశబోయిని నర్సింలు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేశబోయిని నర్సింలు గత 20 సంవత్సరాలుగా సామాజిక కార్యకర్తగా, సమాజ శాస్త్ర పరిశోధకునిగా, బాలల హక్కుల సంరక్షకులుగా నిరంతర సేవలు అందిస్తున్న దేశబోయిని నర్సింలు కృషిని గవర్నర్ అభినందించారు.

## మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

**పటాన్‌చెరు, జనవరి 1, ప్రభాతవార్త :** నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంత్రి దామోదర రాజనర్సింహను కాట శ్రీనివాస్‌గౌడ్ కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న కాటా శ్రీనివాస్‌గౌడ్


ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## 1 నుంచి 31 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 1 నుంచి 31 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నాయని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు 2026 సడక్ సురక్ష అభియాన్‌లో భాగంగా రహదారి భద్రతా మసోత్సవాలు ప్రారంభించి మాట్లాడారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్క వాహనదారుడు క్షేమంగా ఇంటికి చేరడమే ఈకార్యక్రమ ఉద్దేశమన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తెలుసుకోవాలన్నారు. విద్యాలయాల్లో రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాహనదారులు నియమాలు పాటించడంతోపాటు హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జగరకుండా ప్రజల్లో అవగాహన తీసుకరావడానికి ప్రతి అధికారి పనిచేయాలని ఆదేశించారు. అనంతరం రోడ్డు భద్రత మసోత్సవాల సంబంధించి ప్రతిజ్ఞను చేయించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా ఆర్టీఏసభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ, ఎంవిఐ శంకర్‌నారాయణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### ఇన్‌చార్జి డిటివో లక్ష్మణ్


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి డిటిఓ లక్ష్మణ్

**సిద్దిపేట రూరల్, జనవరి 1, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని రవాణ శాఖ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు 2026 సడక్ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఇన్‌చార్జి డిటిఓ లక్ష్మణ్, ఎంవిఐ శంకర్‌నారాయణ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ వాహనదారులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈనెల 1 నుంచి 31 వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాలలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీల్లర్ వాహనదారులు సీట్‌బెల్టు ధరించాలన్నారు. మద్యం తాగి సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, బీమా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎవో నజురుద్దీన్, ఎఎంవిఐ శ్రీకాంత్‌రెడ్డి, నేహా, సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే ఆర్టీసీ భద్రత

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్


రోడ్డు భద్రతా మహోత్సవంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ టౌన్ జనవరి 1, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని మెదక్‌జిల్లా అదనపు నగేష్ కలెక్టర్ తెలిపారు. మెదక్ ఆర్టీసీ బస్సు డిపోలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా మహోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అనేక విలువైన ప్రాణాలను కాపాడవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, స్కూల్, కళాశాలలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ తప్పనిసరి, మద్యం తాగి వాహనాలు నడపరాదు, వేగ నియంత్రణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాల అమలులో పోలీస్, రవాణా, విద్యా, ఆరోగ్యశాఖతోపాటు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ, పోలీస్ అధికారులు, రవాణా శాఖ అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హరీష్‌రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**పటాన్‌చెరు, జనవరి 1, ప్రభాతవార్త :** నూతన సంవత్సరం పురస్కరించుకొని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావుకి రామచంద్రాపురం మాజీ ఎంపీపీ నాలకంటి యాదగిరియాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాదులోని హరీష్‌రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, అమీన్ పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి హరీష్ రావుకు పుష గుచ్ఛం ఇస్తున్న యాదగిరి యాదవ్ దృశ్యం

# రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 1, ప్రభాతవార్త:** రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవం సందర్భంగా గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవానికి సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, పాంప్లెట్స్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదాలను తగ్గించి, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రహదారి భద్రతకు సంబంధించిన సందేశాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. అనంతరం రవాణా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులతో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం తాగి వాహనాలు నడపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి అరుణ, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. రవాణా శాఖ జిల్లా కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, డిటిఓ అరుణ, కార్యాలయ ఉద్యోగులతో రహదారి భద్రతా ప్రతిజ్ఞను చేసారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

### విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేత..

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 1, ప్రభాతవార్త:** ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన సంవత్సరం అందరికీ ఆరోగ్యం, ఆనందం, విజయాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో బాధ్యతాయుతంగా, అంకితభావంతో పనిచేయాలన్నారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లక్ష్యాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని కలెక్టర్ కోరారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా పనిచేయాలన్నారు. అనంతరం సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులు జిల్లా కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్నులు అందజేసి, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, జీవితంలో మంచి స్థానంలో నిలవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్‌రెడ్డి, వసతి గృహ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నీలం మధు

## హ్యాపీ న్యూ ఇయర్ రేవంత్ అన్న : నీలం మధు

**పటాన్‌చెరు, జనవరి 1, ప్రభాతవార్త :** 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి న్యూ ఇయర్ విషెస్ తెలిపారు. పటాన్‌చెరు ప్రాంతంలో రెండు జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యలయాలతో పాటు రెండు నూతన పోలీస్ స్టేషన్లను మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో డివిజన్ల అభివృద్ధితోపాటు నూతన మున్సిపాలిటీలకు నిధులు అందించాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో రానున్న మున్సిపల్, స్థానిక ఎన్నికలు, జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడి అత్యధిక స్థానాలను గెలవాలని నీలం మధుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో అత్యధిక స్థానాలు గెలిచే విధంగా అందరం కలిసి కట్టుగా కృషి చేస్తామని నీలం, సీఎంకి తెలిపారు.

## బోయ వాల్మికి కమ్యూనిటీ క్యాలెండర్ ఆవిష్కరణ

**రామచంద్రాపురం, జనవరి 1, ప్రభాతవార్త:** శ్రీవాల్మీకి మహర్షి సమితి బీరంగూడ ఆధ్వర్యంలో బోయవాల్మీకి కమ్యూనిటీ క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బోయ కృష్ణయ్య, వెంకట రమణ, వెంకట రాములు, నాగరాజు, సుదర్శన్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.


బోయ వాల్మికి కమ్యూనిటీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం


కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా అధికారులు

## కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు శుభాకాంక్షల వెల్లువ

**మెదక్ టౌన్, జనవరి 2, ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, ప్రజలు గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పెద్దఎత్తున దుప్పట్లు అందించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, కార్యాలయ సిబ్బంది కలిసి విద్యార్థులకు దుప్పట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సమష్టికృషితో మెదక్‌జిల్లా అభివృద్ధిలో మరిన్ని మైలురాళ్ల రాష్ట్రస్థాయిలో ఆదర్శ జిల్లాగా నిలవాలన్నారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా 2025 సంవత్సరంలో సాధించిన పురోగతి, మిగిల్చిన మధురస్మృతులు, విజయాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ, వాటి సాధన కోసం అంకితభావంతో కృషి చేసిన అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరికీ కలెక్టర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కొత్త సంవత్సరం 2026 జిల్లావాసులందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. కొత్త సంవత్సరం మరింత ఉత్సాహంతో అధికారులు పనిచేసి... ప్రభుత్వ పథకాల ఫలాలు చివరి గడపకు చేరేలా చూడాలన్నారు. నూతన సంవత్సరం అందరికీ కొత్త ఆశలు, నూతన ఉత్సాహం, మరిన్ని విజయాలను అందించాలని కలెక్టర్ తన సందేశంలో పేర్కొన్నారు.

## వరి నారుమడులపై చలి ప్రభావం అధికం

**చౌటకూరు, జనవరి 1, ప్రభాతవార్త:** వరి నారుమడులపై చలి తీవ్రత అధికంగా ఉందని, సంగుపేట ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. మండల కేంద్రమైన చౌటకూరులో గురువారం యాసంగి సీజన్ వరి నారుమడులను పరిశీలించారు. చలి ప్రభావంతో నారుమడి ఏర్ర బడటం, నారు ఎదుగదల లేకపోవడం లాంటి సమస్యలను కనిపిస్తున్నాయ న్నారు. సమస్యను పరిష్కరించేందుకు రైతులు మేళుకువలు పాటించాలని పలు మేళుకువలను సూచించారు. సాయంత్రం నారుమడికి నీరు పెట్టి ఆ నీటిని రాత్రి మొత్తం ఉంచి ఉదయమే తీసివేయాలన్నారు. ప్రధానంగా ఎరువుల వినియోగం నారుమడికి అందించాలని, ఒకబస్తా తుకానికి అడుగు మందు ఎరువు రెండు కిలోలు, యూరియా కిలో రెండింటికి కలిపి సమంగా చల్లాలన్నారు. రైతులు యాజమాన్య పద్దతులుపాటిస్తే పంట దిగుబడి రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో రైతులు మాణిక్‌రెడ్డి, రైతువిజ్ఞాన కేంద్రం యంగ్ ప్రొఫెషనల్-1 శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రిలో ప్రాణాలకు భరోసా ఏదీ...?

### వైద్యులుగా మారిన స్వీపర్, సెక్యూరిటీ గార్డ్.. కుర్చీకే పరిమితమైన డాక్టర్..! నలుగురికి గాను ఒక్కరే అందుబాటులో..

**రామాయంపేట, జనవరి 1, ప్రభాతవార్త :** రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పేదోడి వైద్యం అపహాస్యమవుతోంది. ప్రాణాలు కాపాడాల్సిన డాక్టర్లు కుర్చీలకే పరిమితమై, రికార్డుల రాతల్లో మునిగిపోతుంటే.. కనీస అవగాహన లేని స్వీపర్లు, వాచ్‌మెన్లు డాక్టర్లుగా అవతారమెత్తి చికిత్స అందిస్తున్నారు. గురువారం జరిగిన ఓ రోడ్డు ప్రమాద బాధితులకు ఎదురైన అనుభవం...ఇక్కడి వైద్యం ఎంత అస్తవ్యస్తంగా ఉందో కళ్లకు కట్టింది.

**ప్రమాదం ఒకవైపు.. నిరక్ష్యం మరోవైపు**

నార్సింగ్ మండల పరిధిలోని జప్తి శివునూర్ సమీపంలో గురువారం ఒకఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రక్తపు మడుగులో ఉన్న బాధితులను స్థానికులు వెంటనే రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర చికిత్స అందుతుందనిభావించిన బాధితులకు అక్కడ చుక్కెదురైంది. నిబంధనల ప్రకారం నలుగురు వైద్యులు ఉండాల్సిన చోట ఇద్దరే హాజరయ్యారు. అందులో ఒకరు వ్యక్తిగత పనిపై బయటకు వెళ్లగా, ఉన్న ఒక్క మహిళా డాక్టర్ బాధితులను పట్టించుకోకుండా రికార్డులు రాసుకోవడంలో నిమగ్నమయ్యారు.

**వైద్యం చేస్తున్న స్వీపర్, వాచ్‌మెన్**

తీవ్ర గాయాలతో బాధితులు విలవిలలాడుతున్నా డాక్టర్ స్పందించకపోవడంతో, ఆసుపత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్న సాజిద్, వాచ్‌మెన్ స్వామి రంగంలోకి దిగారు. గాయాలకు డ్రెస్సింగ్ చేయడం, ప్రాథమిక చికిత్స అందించడం వంటి పనులన్నీ వారే చక్కబెట్టారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి శిక్షణ లేని సిబ్బందితో చికిత్స చేయించడం చూసి బాధితుల బంధువులు, స్థానికులు అవాక్కయ్యారు. "మా ప్రాణాలతో చెలగాటమాడుతారా?" అంటూ ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


క్షతగాత్రులకు వైద్య చేస్తున్న స్వీపర్, సెక్యూరిటీ గార్డు

**చర్యలు తీసుకుంటాం: డిసిహెచ్**

ఈ ఘటనపై వైద్య విధాన పరిషత్(డిసిహెచ్) శివదయాల్ స్పందించారు. రామాయంపేట ఆసుపత్రిలో జరిగిన ఉదంతంపై ఇప్పటికే ప్రాథమిక సమాచారం సేకరించామని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కంటికి రెప్పలా కాపాడాల్సిన వైద్యులే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


మోతిమాత జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పి పరితోష్ పంకజ్

## జాతర ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పి

**జహీరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:** మొగుడంపల్లి మండలం ఉప్పరిపల్లి తండాలోగల మోతిమాత జాతరఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం అవుతున్నందున కొనసాగుతున్న ఏర్పాట్లను జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్ గురువారం పరిశీలించారు. జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పి సంబంధిత అధికారులకు, ఆలయ కమిటి బాధ్యులకు సూచించారు. బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## పిల్లల భవిష్యత్తే సమాజ భవిష్యత్తు

### మెదక్ జిల్లా ఎస్పి శ్రీనివాసరావు


పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్పి శ్రీనివాసరావు

**మెదక్ టౌన్, జనవరి 1, ప్రభాతవార్త:** పట్టణంలోని బాల సాధన్‌లో గురువారం పిల్లలతో కలిసి నూతన సంవత్సర వేడుకలను మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పిల్లల చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే భవిష్యత్తులో వారు సాధించాలనుకుంటున్న లక్ష్యాల వివరాలు తెలుసుకొని, మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, కష్టపడి చదివే అలవాటు ఉంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పిల్లలకు ప్రోత్సాహం అందించారు. పిల్లల భవిష్యత్తే సమాజ భవిష్యత్తు అని, మంచి పౌరులుగా ఎదగాలంటే విద్యే ప్రధానఆయుధమని ఈ సందర్భంగా తెలిపారు. నూతన సంవత్సరంలో పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా చదువులో ముందుకు సాగాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, రంగానాయక్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, శైలేందర్, బాలసాధన్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాచారం శివారులో మహిళ మృతదేహం లభ్యం

**వర్గల్, జనవరి 1(ప్రభాతవార్త):** నాచారం గ్రామ శివారులో హత్యకు గురైన వివాహిత మృతదేహం గురువారం లభ్యమైంది. గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం... తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ నగ్రామానికి చెందిన జోడు నర్సింలు కూతురు కల్పన(26)ను ఆరు సంవత్సరాల క్రితం కన్యారం గ్రామానికి చెందిన మంతూర్ గణేష్‌తో వివాహం జరిపించారు. ఆరు నెలల క్రితం భర్తతో గొడవలు జరగడంతో ఇస్లాంపూర్‌లోని అమ్మగారి ఇంటి వద్దే ఉంటోంది. గత నెల 30వ తేదీన సాయంత్రం 6 గంటలకు ఆరోగ్య పరీక్షల నిమత్తం హైదరాబాద్‌కు వెళ్లింది. కాగా 31వ తేదీ బుధవారం అర్ధరాత్రి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడచుట్టూ తాడు లేదా వైర్‌తో గట్టిగా బిగించి చంపివేసి నాచారం గ్రామశివారులో పడవేసినట్లుగా ఉందని సిఐ తెలిపారు. మృతురాలి తండ్రి జోడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

## న్యూ ఇయర్ వేడుకల్లో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

**జహీరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:** 2026 నూతన సంవత్సరాన్ని పురష్కరించుకుని బుధవారం రాత్రి డిఎస్‌పి సైదానాయక్ ఆధ్వర్యంలో సిఐ శివలింగం, ఎస్ఐ వినయ్‌కుమార్‌తోపాటు పోలిసులు జాతీయ రహదారిపై, చౌరస్తాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 10 మందిపై కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. వారం రోజుల నుంచి నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని ప్రజలు పాటించాలిన పద్దతులపై విస్తృతంగా ప్రచారం చేసినా తమకేం పట్టనట్లుగా వ్యవహరించిన 10 మందిపై కేసులు నమోదుచేశామన్నారు. బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు బేకరీలు, వైన్ దుకాణాల ముందు పహారా కాసి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నామని, అందుకు ప్రజలు సహకరించారన్నారు.

## చాక్రియాల శివారులో అక్రమ మట్టి నిల్వలు

### -శివంపేటలో టిప్పర్‌ల పట్టివేత

**చౌటకూరు, జనవరి 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివంపేట, సరాఫ్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు అక్రమ సంపాదనే ధ్యేయంగా అక్రమంగా మట్టిని తరలిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. అక్రమంగా కొనసాగుతున్న మట్టి దందాపై రెవెన్యూ అధికారులు కన్నెర చేస్తూ గురువారం మట్టి మొరం కుప్పలను సీజ్ చేశారు. శివంపేట గ్రామ శివారులోని గుట్టప్రాంతాన్ని తమ ఆదీనంలోకి తీసుకుని మట్టి, మొరరం దందా చేస్తున్నారని శివంపేట గ్రామానికి చెందిన ఎంపిపి కో-ఆప్షన్ మాజీ సభ్యులు ఎండి అలీం, బిఆర్ఎస్ నాయకులు ఏర్పుల రాజేందర్‌తో కలసి డిసెంబరు 29న ప్రజావిణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విధితమే. తహసీల్దార్ నామాల కిష్టయ్య ఆధ్వర్యంలో రెవిన్యూ ఆర్ఐ ప్రమోద్‌కుమార్, పీజిఓ సిబ్బంది గురువారం దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన మట్టి కుప్పలను సీజ్ చేశారు. బుధవారం రాత్రి శివంపేట గ్రామ శివారులోని మంజీరర నది సమీపంలో నిర్మించిన ఓ ప్రయివేటు గోదాములో లోపలి భాగాన్ని ఎత్తు పెంచేందుకు అవసరమైన మొరరం మట్టిని సరాఫ్‌పల్లి గ్రామానికి చెందిన టీఎస్ 08 యూబీ 6487 టిప్పర్‌లో తరలించి మొరం ఖాళీ చేస్తుండగా రెవిన్యూ అధికారులు టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు.


న్యూ ఉన్నాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మట్టి కుప్పల దృశ్యం

## నియోజకవర్గంలోని ప్రజలకు అండగా నిలుస్తాం

**యూసుఫ్‌గూడ, జనవరి 1, ప్రభాతవార్త:**
కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు కంటెస్టెడ్ ఎమ్మెల్యే మాగంటి సునీత శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలపై పోరాటం చేస్తూ ప్రజలకు అండగా నిలిచేలా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గం సీనియర్ నాయకులు జీటీఎస్ దేవాలయం మాజీ చైర్మన్ చిన్న రమేష్ ఆధ్వర్యంలో సునీతను కలిసి పూలబొకే, శాలువాతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్బాబాయి, సమ్మద్ భాయ్ రామకృష్ణ, జాకీర్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు కనకదుర్గ అమ్మవారి ప్రసాదం అందజేత

**యూసుఫ్‌గూడ, జనవరి 1, ప్రభాతవార్త:**
కనకదుర్గ అమ్మవారు ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలంటూ ఆకాంక్షిస్తూ పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. కొత్త సంవత్సరంలో ప్రజలు, కాంగ్రెస్ పార్టీ చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం కావాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, నాగరాజు, భరత్‌కుమార్, ప్రసాద్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది కాంగ్రెస్‌పార్టీకి మరింత మేలు చేకూరాలి

**-డిసిసి అధ్యక్షుడు దీపక్‌జాన్**

**బేగంపేట, జనవరి 1, ప్రభాతవార్త:**
ఈ ఆంగ్లనామ సంవత్సరంలో కాంగ్రెస్‌పార్టీకి మరింతమేలు చేకూరాలని, పార్టీలో చేరికలతో బూత్ స్థాయిలో మరింత పటిష్టానికి కృషి చేయాలని సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్ పిలుపునిచ్చారు. గురువారం ప్యారడైజ్ హోటల్లో సనత్‌నగర్ నియోజకవర్గం మాజీ ఏ బ్లాక్ అధ్యక్షుడు షేక్ గౌస్, యువ నాయకుడు అభిషేక్ అడపా ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. ముందుగా దీపక్ జాన్ కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట డివిజన్‌లోని కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా దీపక్ జాన్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి పలువురు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నారని, త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు గొరవల్లి రమేష్, సీ.రాజేందర్, హెజీబీటర్, మహ్మద్ ఫయాజ్, మునీరీఖాన్, హనీఫ్, రమాదేవి, చంద్రకళ, ముష్రా, రాణి, తస్లీమ్, అల్తాఫ్ మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదినిమిషాల్లో చిక్కడపల్లి టు లిబర్టీ

**-6కోట్లతో లింక్ బ్రిడ్జి నిర్మించిన జిహెచ్ఎంసి**
**-నేడు ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:**
అశోక్‌నగర్ నుంచి దోమలగూడ హుస్సేన్‌సాగర్ నాలా లింక్ బ్రిడ్జి పనులు ఇప్పటికే పూర్తికాగా, ఈ లింక్ బ్రిడ్జిను శుక్రవారం జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్, డిప్యూటీమేయర్‌లతో కలిసి ప్రారంభించనున్నారు. చిక్కడపల్లి నుంచి అశోక్ నగర్, దోమలగూడను కలిపే లింక్ బ్రిడ్జి మీదుగా దోమలగూడ నుంచి లిబర్టీ జీహెచ్ఎంసీ ఆఫీస్ వరకు ఈ బ్రిడ్జి కొనసాగనుంది. 2 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్న ఈ బ్రిడ్జిపై వెళ్తే కేవలం 10నిమిషాల్లో లిబర్టీకి చేరుకోవచ్చు. ఈ మార్గంలో ఎలాంటి సిగ్నల్స్ ఉండవు. రూ.6కోట్ల వ్యయంతో 2023లో పనులు ప్రారంభమయ్యాయి. ప్రధాన బ్రిడ్జి 48మీటర్ల విస్తీర్ణంతో నిర్మించారు. దోమలగూడవైపు నుంచి లిబర్టీకివెళ్లే ర్యాంపును 38మీటర్లతో నిర్మించారు. అశోక్‌నగర్ వైపు నుంచి వెళ్లేవారికి 22మీటర్లతో ర్యాంపును నిర్మించారు. చిక్కడపల్లి సుధాహోటల్ నుంచి త్యాగరాయ గానసభ, నగర కేంద్ర గ్రంథాలయం, అశోక్‌నగర్ నుంచి లిబర్టీకి చేరుకోవచ్చు. దోమలగూడ సూరజ్‌నగర్ కాలనీ నుంచి గగన్‌మహల్, లిబర్టీ జీహెచ్ఎంసీ కార్యాలయం వరకు నేరుగా వెళ్లొచ్చని జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఏఈ ప్రశాంత్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## తల్లిదండ్రుల్ని వృద్ధాశ్రమాలకు పరిమితం చేయొద్దు

**-నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్**

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:**
నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. అత్యంత వినూత్నంగా ఒక మంచి సేవా కార్యక్రమంతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరలవుతోంది. నూతన సంవత్సర వేడుకలను ఓ వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడి వారితో ఆనందాన్ని పంచుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్‌నటి పావలా శ్యామలను పరామర్శించారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా షేర్ చేశారు. నూతన సంవత్సర వేడుకలంటే కేవలం సంబరాలు, హంగులే కాదు, ఆత్మీయతను పంచుకోవడం, బాధ్యతను గుర్తుచేసుకోవడం. ఇదే సంకల్పంతో ఈ ఏడాది తొలిరోజును నిరాడంబరంగా, సేవా దృక్పథంతో ప్రారంభించాను. సహచర పోలీసు అధికారులతో కలిసి గురువారం కార్ఖానాలోని ఆర్కే ఫౌండేషన్ వృద్ధాశ్రమాన్ని సందర్శించడం, అక్కడి 48మంది పెద్దల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడం ఆనందాన్ని కలిగించింది. అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్‌నటి పావలా శ్యామలను పరామర్శించాను. కష్టకాలంలో ఉన్న ఆమెను ఆదుకుని, ఈ హెల్త్‌కేర్ సెంటర్లో చేర్పించిన తిరుమలగిరి ఏసీపీ రమేష్ చొరవ అభినందనీయం అని ప్రశంసించారు. గత 18ఏళ్లుగా వేలమందికి ఉచిత వైద్యం, ఆశ్రయం కల్పిస్తున్న డాక్టర్ రామకృష్ణ సేవ స్ఫూర్తిదాయకం. ఈ సందర్భంగా నాదొకటే విన్నపం. వృద్ధాశ్రమాలు లేని సమాజం రావాలి. మనల్ని కంటికి రెప్పలా పెంచిన తల్లిదండ్రుల రుణం ఎంత సేవచేసినా తీరనిది. ఆధునిక జీవనశైలి, ఒత్తిళ్ల సాకుతో వారిని వృద్ధాశ్రమాలకు పరిమితం చేయవద్దు. చరమాంకంలో వారికి కావాల్సింది ఆస్తులు కాదు. పిల్లల ఆప్యాయత, నాలుగు తీపిమాటలు మాత్రమే. తల్లిదండ్రులను భారంగా కాకుండా, బాధ్యతగా, దైవంగా భావిద్దాం. వారి సేవలోనే నిజమైన ఆనందాన్ని వెతుక్కుందాం. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు అని సిపి సజ్జనార్ పేర్కొన్నారు.

## అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు

**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త:**
అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా ఉద్యోగులు నూతన ఉత్సాహంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, జితేందర్‌రెడ్డి, డిఆర్ఓ ఈ.వెంకటాచారితో కలిసి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిరాం, సిపిఓ డాక్టర్, సురేందర్, సంక్షేమ అధికారులు అక్కేశ్వరరావు, జి.ఆశన్న, ఇలియాస్ అహ్మద్, ప్రవీణ్‌కుమార్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటి, జిఎం పరిశ్రమలు పవన్‌కుమార్, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ అధికారి రాజేందర్, అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## విహెచ్‌ను కలిసిన సీనియర్ కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:**
నూతన సంవత్సర సందర్భంగా పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావును పలువురు సీనియర్ కాంగ్రెస్‌నేతలు కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఉదయం అంబర్‌పేటలోని ఆయన నివాసంలో టిపిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆర్.లక్ష్మణ్‌యాదవ్ మాజీకార్పొరేటర్ పి.నారాయణస్వామి, మహంకాళిదేవస్థానం సేవాసమితి వైస్‌చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు షేక్ జమీర్, షేక్ సర్ఫరాజ్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# ముసాయిదా ఓటరు జాబితా విడుదల

**-మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి**



ఓటరు జాబితాను విడుదల చేసిన మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి తదితరులు

**నర్సాపూర్, జనవరి 1, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపాలిటీ 2వ సాధారణ ఎన్నికలు 2026 ప్రక్రియలో భాగంగా గురువారం నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో 1నుండి 15వార్డుల ముసాయిదా ఓటరుజాబితా మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు నుండి 15 వార్డుల ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశామని, ఓటరు జాబితాను మున్సిపల్ కార్యాలయంలో నోటీస్ బోర్డులో ప్రదర్శించామన్నారు. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో 15వార్డుల్లో 17066 ఓటర్లు ఉన్నారని, ఇందులో 8737 మహిళా ఓటర్లు కాగా, 8328 పురుష ఓటర్లు ఉండగా, ఇతరులు ఒకరు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 15 వార్డులోని ఓటర్లు తమ వివరాలు మున్సిపల్ కార్యాలయంలో చూసుకోవచ్చని కమిషనర్ శ్రీరామ్ చరణ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆఫీస్ మేనేజర్, సీనియర్ సహాయకులు, జూనియర్ అకౌంటెంట్, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిసిన శ్రీధర్‌గుప్తా



మదన్‌రెడ్డిని శుభాకాంక్షలు తెలిపుతున్న పైడి శ్రీధర్‌గుప్తా

**నర్సాపూర్, జనవరి 1, ప్రభాతవార్త:**
నర్సాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిని నర్సాపూర్ పట్టణానికి చెందిన శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు పైడి శ్రీధర్‌గుప్తా గురువారం హైదరాబాదులోని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి నివాసగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, 2026 నూతన సంవత్సరం సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆరోగ్యానికి వ్యాయామం అవసరం

**-గ్రామ సర్పంచ్ ప్యాట సరితమహేష్**



వ్యాయామం చేస్తున్న యువతీయువకులు

**నర్సాపూర్, జనవరి 1, ప్రభాతవార్త:**
శారీరక మానసిక ఆరోగ్యం కోసం ప్రతినిత్యం వ్యాయామం ఎంతో దోహదపడుతుందని చిన్నచింతకుంట గ్రామ సర్పంచ్ ప్యాట సరితమహేష్ అన్నారు. గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని చిన్నచింతకుంట గ్రామంలో యువతీయువకులతో కలిసి ఆరోగ్య చిన్నచింతకుంట అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వజ్జ పెంటయ్య, కరాటే మాస్టర్ దోసలి మల్లేష్, మహేష్, నాగేష్, శ్రీకాంత్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్



సునీతాలక్ష్మారెడ్డినికలిసిన రామంతపూర్ తండా సర్పంచ్, తదితరులు

**వెల్దుర్తి, జనవరి 1, ప్రభాతవార్త:**
మాసాయిపేట మండలంలోని రామంతపూర్ తండా సర్పంచ్ కితావాత్ చందర్, ఉపసర్పంచ్ రాజు, మాజీ ఎంపిటిసి సోనీశ్రీనివాస్‌నాయక్, వార్డు సభ్యులు, గ్రామస్థులు కలిసి గురువారం నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నివాసానికి వెళ్లి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు.

## కెజెఆర్ గార్డెన్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

**కంటోన్మెంట్, జనవరి 1, ప్రభాతవార్త:**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ జెబిఎస్ సమీపంలోని కెజెఆర్.గార్డెన్‌లో పి.జె.స్టీఫెన్ పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. లైఫ్ చేంజింగ్ రివైవల్ చర్చి వాచ్‌నైట్ సేవా అరాధన కార్యక్రమం చారిత్రాత్మకంగా ఆత్మీయంగా సాగింది. పాస్టర్ స్టీఫెన్ పాల్ క్రైస్తవ దృక్పథంలో నూతన సంవత్సరానికి ఉన్న నిజమైన అర్థాన్ని వివరించి ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో వేలాదిమంది క్రైస్తవులు పాల్గొన్నారు. కార్యక్రమం డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు కొనసాగింది.

## జలాల్‌పూర్‌లో యువకుల స్వచ్ఛభారత్



ఫొటో ఫైల్‌నేమ్ :5. గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న యువకులు

**వెల్దుర్తి, జనవరి 1, ప్రభాతవార్త:**
మండలంలోని మన్నెవరం జలాల్‌పూర్ గ్రామంలో గురువారం యువకులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ యువకులు నూతన సంవత్సరం పురస్కరించుకొని గ్రామ సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రంగి కృష్ణ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ప్రతినిధులతో కలిసి స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులు శుభ్రంచేసి, చెత్తా చెదారాన్ని తొలగించారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## శ్మశానవాటిక నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ బస్తీవాసుల నిరసన

**యూసుఫ్‌గూడ, జనవరి 1, ప్రభాతవార్త:**
బోరబండలోని పీలీ దర్గా ఎదురుగా ఉన్న స్థలంలో కబరస్తాన్ (శ్మశాన వాటిక) ఏర్పాటుకు స్థలం కేటాయించవద్దంటూ పెద్ద ఎత్తున స్థానిక బస్తీల వాసులు కలెక్టర్ ఆఫీస్‌ముందు బ్యానర్లతో నిరసన తెలిపారు. చుట్టూ నిర్వాసితులు ఉండటం జరిగిందని తమకు ఇబ్బందులు తలెత్తకుండా వేరే స్థలంలో కబర్‌స్తాన్ ఏర్పాటుకు చూడాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అందుకు వారు విషయాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు.

## బాధితులను పరామర్శించిన కోలన్ హన్మంత్‌రెడ్డి

**జగద్గిరిగుట్ట, జనవరి 1, ప్రభాతవార్త:**
జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని భవానినగర్‌లో రాత్రి 17మంది కలిసి వేడుకలు జరుపుకోగా, మద్యంతాగి, బిర్యానీ తిని 17మంది అస్వస్థతకి గురయ్యారు. వీరిలో పాండు(53) మృతిచెందగా..అపస్మారకస్థితిలో ఉన్న 15 మంది నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రికిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్‌రెడ్డి బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో సోమ్మాన్నగారి శ్రీధర్‌రెడ్డి, సిద్దనోల సంజీవరెడ్డి, గఫ్ఫార్, రహీం, చందు, రాంచందర్, అమీర్, అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు ఘనసన్మానం

**నార్సింగి, జనవరి 1, ప్రభాతవార్త:**
మూడుదశాబ్దాల పాటు తెలంగాణ పోలీసు అకాడమిలో పనిచేస్తున్న ఉద్యోగులు మల్లమ్మ, యాదమ్మలను గురువారం అకాడమి డిప్యూటీ డైరెక్టర్ అడ్మిన్ కెఆర్‌కె.ప్రసాద్ ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిక్షణపొందేందుకు పోలీసు అకాడమీకి వచ్చిన వేలాదిమంది పోలీసు అధికారులకు మల్లమ్మ, యాదమ్మలు చేసిన సేవలు మరువలేనివన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, పదవీ విరమణలు తప్పవన్నారు. అప్పగించిన పనిని అంకితభావంతో పూర్తిచేసి మంచిపేరు తెచ్చుకునేందుకు సర్వశక్తులు ఒడ్డాలని సూచించారు. పదవీవిరమణ పొందిన ఉద్యోగులను అడ్మిన్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మహేష్, జూనియర్ ఆఫీసర్ మెస్ ఇంచార్జి ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సన్మానించారు.

## తాగారు ...చిక్కారు

**-న్యూఇయర్ వేళ పట్టుబడ్డ మందుబాబులు**
**-ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటుచేసిన పోలీసులు**

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:**
న్యూ ఇయర్ అంటే చాలు.. మద్యం ప్రియులకు పండగే పండగ.. కొత్త ఏడాదికి స్వాగతంపలికే జోష్‌లో మద్యంతాగి రోడ్డెక్కి పోలీసులకు పట్టుబడ్డారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా హైదరాబాద్లో పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. పోలీసులు పదేపదే హెచ్చరికలు చేసినప్పటికీ మందుబాబులు మాత్రం లెక్కచేయకపోవడంతో భారీ సంఖ్యలో పట్టుబడ్డారు. మూడు కమిషనరేట్ల పరిధిలో మొత్తం 2731 మంది మద్యం సేవించి వాహనాలునడుపుతూ పోలీసులకు చిక్కారు. పట్టుబడిన వారందరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1198, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 928, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 605 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పోలీసుల చేతికి చిక్కారు. మద్యంతాగి కొన్నిప్రాంతాల్లో మందుబాబులు న్యూసెన్స్‌చేయడం జరిగింది. నాంపల్లి, వనస్థలిపురం వంటి ప్రాంతాల్లో మద్యం మత్తులో కొందరు హల్‌చల్ చేయడంతో.. పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా మారింది. వనస్థలిపురంలో ఓ వ్యక్తిని డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేయగా.. కానిస్టేబుల్ తనను ఎందుకు కొట్టాడని రోడ్డుపై పడుకుని హల్‌చల్ చేశాడు. పోలీసులు వచ్చేలోగా అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో అతడిపై, ఇలాగే న్యూసెన్స్ సృష్టించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసారు.

# మందుబాబులకు అడ్డాగా విద్యుత్ సబ్‌స్టేషన్

**-పట్టించుకోని విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు**



నర్సాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ కేంద్రం దృశ్యం

**నర్సాపూర్, జనవరి 1, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని మూసాపేటగ్రామం లోగల 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ మందుబాబులకు అడ్డాగా మారింది. అదేవిధంగా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని ఆ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గత సంవత్సరకాలం నుండి గ్రామానికి చెందిన కొందరు యువకులు అసాంఘిక కార్యక్రమాలకు కోసం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను అడ్డాగా మారుస్తున్నారని గ్రామ యువకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆ గ్రామ యువకులు పలుమార్లు విద్యుత్ అధికారులకు వినతిచేసినా, పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. ఇటీవల తాజాగా డిసెంబర్ 31 రోజురాత్రి కొందరు యువకులు మద్యం సేవిస్తూ పట్టుబడ్డారు. ఈ సంఘటనలో మరికొంతమంది వారిపై దాడికి దిగినట్లు సమాచారం. సబ్‌స్టేషన్ లోపలికి వెళ్ళగా వారిపై కూడా రాళ్లతో దాడిచేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈమేరకు గ్రామస్థులు పోలీసులకు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ కేంద్రంలో ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతుండడంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం ఎంతవరకు సమంజసం అని గ్రామస్థులు ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే అధికారులు స్పందించి విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## భీమా కోరేగావ్ మహర్ వీరుల వారసత్వాన్ని కొనసాగించాలి

**-ప్రజాసంఘాల నాయకులు**



వీరులకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

**గజ్వేల్, జనవరి 1, ప్రభాతవార్త:**
అంటరానితనాన్ని శాశ్వతంగా కొనసాగించి తమ బానిసత్వం కింద మగ్గాలని అణచివేసిన పీష్వా బ్రాహ్మణులపై తిరుగుబాటుచేసి ఓడించిన భీమా కోరేగావ్ మహర్ వీరుల వారసత్వాన్ని కొనసాగించాలని అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు అటుకూరి రాములు, మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్, ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉమర్‌సుల్తానా, డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణులు పిలుపునిచ్చారు. గురువారం భీమా కోరేగావ్ విజయ్‌దివస్ సందర్భంగా గజ్వేల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి మహర్ వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్‌సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నె కృష్ణ, మాలమహానాడు సీనియర్‌నాయకులు యాదగిరి, నీరుడి స్వామి, బైరము రమేష్, అనంతరావుపల్లి మల్లేశం, బిసి నాయకులు బాకి స్వామి, అంబేద్కర్‌సంఘం కార్యదర్శి మైస స్వామి, డిబిఎఫ్ మండల అధ్యక్షుడు సింగాటం చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## శుభాకాంక్షలు తెలిపిన సిపి సజ్జనార్

**హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:**
నూతన సంవత్సర ఆగమనాన్ని పురస్కరించుకుని బుధవారం అర్ధరాత్రి 12గంటలకు రాష్ట్ర సచివాలయం, చార్మినార్, కెబిఆర్ పార్క్, మెహిదీపట్నం రైతు బజార్ వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటీ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నగర ప్రజలకు, పోలీస్ శాఖలోని సిబ్బందికి, వారి కుటుంబసభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల భద్రతే ప్రాధాన్యంగా గడిచిన ఏడాదిలో పోలీస్ శాఖకు సహకరించిన నగర ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. 2026లో కూడా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఇలాగే ఉండాలని కోరారు. పండగలు, వేడుకల సమయంలో కూడా కుటుంబాలకు దూరంగా ఉండి, విధి నిర్వహణలో నిమగ్నమైన పోలీస్ అధికారులను సిబ్బందిని ఆయన అభినందించారు. నగరాన్ని మరింత సురక్షితమైన, నేరరహిత నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 10 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీసులకు సహకరించిన ప్రజలందరికి ధన్యవాదములు తెలిపినారు. ఈ వేడుకల్లో జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీసులు డి.జోయల్ డెవిస్, తఫ్సీర్ ఇకుబాల్, డిసిపిలు, రక్షిత కృష్ణ మూర్తి, కె.అపూర్వరావు, కె.శిల్పావళి, కారే కిరణ్‌ప్రభాకర్, లావణ్య నాయక్‌జాదవ్, సిహెచ్.శ్రీనివాస్, జి.చంద్రమోహన్, సిహెచ్.రూపేశ్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, వి.అరవింద్‌బాబు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. అందరూ ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు.

## వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

**-చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్**

**చార్మినార్, జనవరి 1, ప్రభాతవార్త:**
రానున్న వేసవి కాలం సందర్భంగా పాతబస్తీలో ఎటువంటి విద్యుత్ సమస్యలు కలగకుండ తగు చర్యలు తీసుకున్నామని టిజిఎస్‌పిటిసిఎల్ చార్మినార్ డివిజినల్ ఇంజనీరు ఎం.శ్రీధర్ అన్నారు. చార్మినార్ డివిజనల్ పరిధిలోని అన్ని విద్యుత్‌సెక్షన్ల పరిధులలో నిర్వహిస్తున్న ప్రజాబాట కార్యక్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు అవసరవమైన మరమ్మతులు చేయటం జరిగిందని తెలిపారు. ఆధునీకరించిన చార్మినార్ డిఈ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. పలువురు విద్యుత్ అధికారులు డిఈ ఎం.శ్రీధర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న 100,160 కెవిల సామర్థ్యంగల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 315,500 కెవిల సామర్థ్యానికి పెంచటం జరిగిందని ఆయన తెలియజేశారు. అత్తాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో ఏషియన్ థియేటర్ వద్ద త్వరలో కొత్త విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించనున్నామని, ఈ సబ్ స్టేషన్ వల్ల హైదర్‌గూడ, అత్తాపూర్ సబ్ స్టేషన్‌లలో లోడ్ రిలీఫ్ అవుతుందని ఆయన తెలిపారు. హైదరాబాద్ పాతబస్తీలోని పలు ప్రాంతాలలో పది కిలోమీటర్లు వరకు ఎల్‌టి ఏబి కేబుళ్లను ఏర్పాటు చేయటం జరిగిందని డిఈ శ్రీధర్ తెలియజేశారు. చార్మినార్ డివిజన్ పరిధిలో100,కేవి,160 కేవీల సామర్థ్యంగల పోల్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ ఏఈ సత్యనారాయణగౌడ్, కిషన్‌బాగ్ ఏఈ శివప్రసాద్, మీరాలం ఏఈ బుచ్చిరెడ్డితో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## అతివేగానికి మూల్యం రెండు ప్రాణాలు

**-ఆగి ఉన్న డిసిఎంను ఢీకొన్న ద్విచక్రవాహనం**
**-సంఘటనా స్థలంలో కావ్య**
**చికిత్సపొందుతూ కౌశిక్‌లు దుర్మరణం**

**నార్సింగి, జనవరి 1, ప్రభాతవార్త:**
అతివేగం ఇద్దరు విద్యార్థుల ప్రాణాలను బలితీసుకుంది. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... హైదరాబాద్‌లోని రామంతాపూర్ ప్రాంతానికి చెందిన శ్రీహరి కూతురు కావ్య(20) రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌లో ఉన్న శ్రీచైతన్య డీమ్డ్ కళాశాలలో బిసిఎ తృతీయ సంవత్సరం చదువుతుంది. 31 డిసెంబరు 2025 మధ్యాహ్నం 2:10 గంటల సమయంలో అదే కళాశాలలో చదువుతున్న తాండూరు మల్కాపూర్ ప్రాంతానికి చెందిన నర్సిహ్మారెడ్డి కుమారుడు కౌశిక్‌రెడ్డితో కలిసి అతడి ద్విచక్రవాహనం(టిఎస్07ఎఫ్‌వి 8914)పై కళాశాల నుంచి హైదరాబాద్ నగరం వైపుకు వచ్చారు. తెలంగాణ పోలీసు అకాడమి నవనామి మాగెలియో కన్స్‌ట్రక్షన్ సైట్‌వద్ద అతివేగంగా ద్విచక్రవాహనం నడుపడంతో వేగం అదుపుతప్పి ఆగి ఉన్న డిసిఎం (ఎపి39యుడబ్ల్యు2654)ను ఢీకొట్టాడు. ఈప్రమాదంలో కావ్య సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందింది. తీవ్రంగా గాయపడ్డ కౌశిక్‌రెడ్డి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ 1 జనవరి, 2026న మరణించాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని నార్సింగి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగం మంచిది కాదని, నియంత్రణతో వాహనాలు తోలాలని నార్సింగి పోలీసులు సూచించారు.

## జ్ఞానీజైల్‌సింగ్ నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్

**జూబ్లీహిల్స్, జనవరి 1, ప్రభాతవార్త:**
ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిల్మ్‌నగర్ జ్ఞానీ జైల్ సింగ్ నగర్‌లో గురువారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడ కమిటీ హాల్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహరించాలని కోరారు. ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ మహేందర్‌రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు, స్థానిక బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు



నాచగిరి క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

**వర్గల్, జనవరి 1 (ప్రభాతవార్త):** 2026 ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వర్గల్ లోని శ్రీవిద్యాధరి క్షేత్రంతోపాటు నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రం గురువారం భక్తులతో పోటెత్తాయి. విద్యాధరి క్షేత్రానికి భారీ సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆలయానికి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు చిన్నారులకు అక్షర స్వీకారం చేయించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. అలాగే భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు మహా ప్రసాదాన్ని అందజేశారు. ఇదిలా ఉండగా నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రానికి సైతం భక్తులు భారీ సంఖ్యలో రావడం జరిగింది. జంట నగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు వివిధ జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే శ్రీ విద్యాధరి, నాచగిరి క్షేత్రాలకు నూతన సంవత్సరం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు రావడం జరుగుతుందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గౌరారం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



భక్తులతో కిటకిటలాడుతున్న మల్లన్న ఆలయం

## స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

**కొమురవెల్లి, జనవరి 1, ప్రభాతవార్త :** కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి వారి ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త సంవత్సరం మొదటి తేదీ కావడంతో భక్తులు, విద్యార్థులు మల్లన్న ఆలయానికి తరలి వచ్చి సందడి చేశారు. సిద్దిపేట, జనగామ, హైరాబాదు, గజ్వేల్, కరీంనగర్, హుస్నాబాద్, కొండపాక, నంగునూర్ తదితర పట్టణాల నుంచి భక్తులు మల్లన్న ఆలయాలనికి తరలివచ్చి స్వామివారిని దరి ్శంచుకున్నారు. భక్తులు స్వామివారికి అర్చన, అభిషేకాలు నిర్వహించి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఆధ్వర్యంలో అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

## పార్టీ పటిష్టతకు సైనికుల్లా పనిచేయాలి : ఎంపి



ఎంపి సురేష్ షెట్కార్‌ను శాలువాతో సత్కరిస్తున్న సిద్దిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కరకుల్ల శివప్ప

**సిద్దిపేట అర్బన్, జనవరి 1, ప్రభాతవార్త :** జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్‌ను సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరకుల్ల శివప్ప గురువారం హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా జిల్లాలో, సిద్దిపేట నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు నరకుల శివప్ప తెలిపారు. జిల్లాతో పాటు సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయడానికి సైనికుల్లా పని చేయాలని సూచించినట్లు తెలిపారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపి



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపి రఘునందన్‌రావు

**దుబ్బాక, జనవరి 1,ప్రభాతవార్త :** బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ మాధవనేని భానుప్రసాద్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన 'బాల వికాస ఉచిత మినరల్ వాటర్' పథకాన్ని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్ రావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి రఘునందన్ రావు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు శుద్ధి చేయబడిన తాగునీటిని పూర్తిగా ఉచితంగా అందించే ఈ సేవ బొప్పాపూర్ గ్రామానికి ఒక మైలు రాయిగా నిలుస్తుందన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఎంపి ప్రారంభించారు. ఈ ఓపెన్ జిమ్ ద్వారా గ్రామ యువత, మహిళలు, వృద్దులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చు కోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. అలాగే గ్రామంలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చు

### -గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి




మాట్లాడుతున్న మురళి

**గజ్వేల్ టౌన్, జనవరి 1 (ప్రభాతవార్త):** ట్రాఫిక్‌రూల్స్ పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని ట్రాఫిక్ సిఐ మురళి ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో ట్రాఫిక్ సిఐ మురళి, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ ప్రేమదీప్, మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉదయం మంచు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ నెమ్మదిగా వెళ్లాలని, ఫాగ్ లైట్స్ వేసుకుంటూ జాగ్రత్తగా నడపాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం మానుకోవాలని, సిగ్నల్స్ వద్ద వేగంగా వెళ్ళవద్దని చెప్పారు. డిపో మేనేజర్ పావన్ మాట్లాడుతూ డ్రైవర్లు మానసిక ఒత్తిడితగ్గించుకొని ఏకాగ్రతతో బస్సులు నడపాలన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో జీరో యాక్సిడెంట్‌లో ఈ సంవత్సరం ఉండాలని కోరారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, ఎంఎఫ్ జమీల్, ఎంసి శ్యామ్‌సుందర్, సేఫ్టీవార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ లిస్టులో తప్పులను సరిచూసుకోవాలి

### మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, జనవరి 1, ప్రభాతవార్త :** ప్రజలు తమ ఓటర్ లిస్టులలో ఉన్న తప్పులను సరి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ తాటి మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర ఎలక్షన్ కమిషన్, మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు మున్సిపలిటీకి సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ లిస్టును వార్డుల వారీ కార్యాలయ నోటీస్ బోర్డుపై అంటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఓటర్ లిస్టులో ఎవరైనా పేరు, అడ్రస్ తప్పుగా ఉన్నా, ఒక వార్డుకు సంబంధించిన ఓటరు మరొక వార్డులో వచ్చినా వాటి అభ్యంతరాలను మున్సిపల్ ఆఫీస్‌కువచ్చి సంబంధిత వ్యక్తులు లిఖితపూర్వకంగా ఈనెల 9వ తేదీలోపు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్



నూతన సంవత్సర క్యాలండర్ విడుదల చేస్తున్న దృశ్యం

## నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

**జిన్నారం: జనవరి 1, ప్రభాతవార్త :** శ్రీశ్లోక ఇంటర్నేషనల్ స్కూల్‌లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కొత్వాల్ హరికృష్ణరెడ్డి క్యాలెండర్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అకాడమిక్ డైరెక్టర్లు మహిపాల్‌రెడ్డి, సింహాచలం, ప్రిన్సిపల్ హరిప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్యాలెండర్ విద్యార్థుల్లో సమయపాలన, క్రమశిక్షణ, లక్ష్యనిర్ధారణ, బాధ్యతాభావం వంటి విలువలను పెంపొందించడంలో ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరంలో అంతా శుభం కలగాలి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, జనవరి 1, ప్రభాతవార్త :** ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకొని ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారంలోగల గణేష్‌గడ్డ శ్రీసిద్ధి వినాయక స్వామి దేవాలయాన్ని గురువారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఎమ్మెల్యే జీఎంఆర్‌కు పూర్ణకుంభంతో స్వాగతంపలికి, వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కాలమానిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రభాకర్, ఆలయ కమిటీ అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గాయత్రి పాండు, సీఐలు వినాయకరెడ్డి, నరేష్, రవీందర్ రెడ్డి, రమణారెడ్డి, మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు రాజు, వెంకన్న, నరసింహ రెడ్డి, నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

### హుస్నాబాద్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ యోగేశ్వర్ సింగ్

**హుస్నాబాద్ రూరల్, జనవరి 1, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని హుస్నాబాద్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ యోగేశ్వర్‌సింగ్ అన్నారు. గురువారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభోత్సవాన్ని బస్ డిపోలో నిర్వహించగా ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 70 శాతం వాహనాలు యువత చేతుల్లోనే ఉన్నాయని, యువత అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంవల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, ఒక్క నిమిషం నిర్లక్ష్యం కొన్ని కుటుంబాలను రోడ్డుపాలు చేస్తుందన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజుల పాటు జరుగుతాయని, ఈనెల రోజులు ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం ఉంటుందన్నారు. నెల రోజులు నేర్చుకునే విషయాలను సంవత్సరం మొత్తం అనుసరించాలని వివరించారు. హుస్నాబాద్ డిపోలోని డ్రైవర్లు గత ఎనిమిది నెలలుగా 0.05 శాతం మాత్రమే యాక్సిడెంట్‌లు చేయడం సంతోషకరమైన విషయమన్నారు. డిపో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో హుస్నాబాద్‌ను యాక్సిడెంట్ రహిత డిపోగా మార్చాలని ఆకాంక్షించారు. అనంతరం సిబ్బందితో రోడ్డు భద్రత మాసోత్సవాలకు సంబందించిన ప్రతిజ్ఞ చేపించి, ఉత్తమ డ్రైవర్లను శాలువాలతో సత్కరించి, నూతన సంవత్సరం సందర్భంగా డిపో మేనేజరు వెంకన్నతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఆర్టీసీ సిబ్బందితో కలసి కేక్‌కట్ చేసిన యోగేశ్వర్ సింగ్



ఎంపి రఘునందన్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దాసి రాజేందర్

## యూత్ పార్లమెంట్‌కు ఎంపికి ఆహ్వానం

**వర్గల్, జనవరి 1 (ప్రభాతవార్త):** జవహర్ నవోదయ విద్యాలయలో ఈ నెల 6వ తేదీన నిర్వహించే యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి హాజరు కావాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావుకు గురువారం నవోదయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ ఆహ్వాన పత్రికను అందజేశారు. వారితోపాటు బిజెపి మండల అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి, శ్యామ్‌సుందర్ తదితరులు ఉన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి : పోతుగంటి ప్రసాద్

**చేర్యాల, జనవరి 1, ప్రభాతవార్త :** యువకులు క్రీడల్లోనూ రాణించాలని, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ 7 వార్డు ఇంచార్జ్ పోతుగంటి ప్రసాద్ అన్నారు. చేర్యాల మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులోని మైసమ్మ,రాజీవ్‌నగర్ యూత్ యువకులకు సొంత ఖర్చులతో క్రీడాసామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో యువకులు చెడు వ్యసనాలు గురికావద్దని, ఆన్‌లైన్ గేములు పక్కన పెట్టి మానసికంగా శారీరకంగా మంచి ఆరోగ్యం ఉండాలంటే క్రీడలపట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆడేపు నరేందర్, కాంగ్రెస్ పార్టీ 4వవార్డు ఇంచార్జ్ అంబాల బుచ్చిరాములుగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు నీలం సన్నీ, పోలోజు ఆంజనేయులు, ఎర్రోళ్ల భాను, పబ్బోజు రమేష్, బండి గణేష్, మనీష్, సందీప్, శీర్ల మురళీ, తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును కలిసిన మాదాసు శ్రీనివాస్



హరీష్‌రావుకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎ.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్

**గజ్వేల్, జనవరి 1 (ప్రభాతవార్త):** మాజీ మంత్రి హరీష్‌రావును గురువారం ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన రాజమౌళి

**గజ్వేల్ టౌన్, జనవరి 1 (ప్రభాతవార్త):** మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు హరీష్‌రావును గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని హరీష్ రావు కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందన్నారు. వారితో పాటు తాజా మాజీ కౌన్సిలర్ చందు, అర్చన శివకుమార్ తదితరులు ఉన్నారు.



హరీష్‌రావును కలిసిన మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

## మదనానంద శారద క్షేత్రంలో ఎమ్మెల్యే పూజలు

**తొగుట, జనవరి 1, ప్రభాతవార్త :** తొగుట శ్రీభవాని చంద్రమౌళీశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు పాడిపంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాంపూర్ మదానంద శారద క్షేత్రంలో గురువారం నూతన సంవత్సరం పురస్కరించుకొని స్పటిక లింగేశ్వరస్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్‌శర్మ, ఘనంగా స్వాగతం పలికారు. రంగంపేట పీఠాధిపతి శ్రీ మదానందా సరస్వతి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

## నాచగిరి క్షేత్రంలో నర్సారెడ్డి ప్రత్యేక పూజలు

**వర్గల్, జనవరి 1 (ప్రభాతవార్త):** గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తన జన్మదినం పురస్కరించుకొని గురువారం వర్గల్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ్మాస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ వేద పండితులు నర్సారెడ్డి దంపతులను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి జ్ఞాపికను, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్త, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, పాలక మండలి సభ్యులు జగన్నాథచార్యులు, శ్రీనివాస్, శేఖర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా కార్డుల పంపిణీ

**తొగుట, జనవరి 1, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయరెడ్డి(అమర్), దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి రైతులకు యూరియా కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా కార్డుల పంపిణీతో దళారుల నిర్మూలన, పంట సాగుచేసిన రైతులకు మాత్రమే యూరియా అందుతుందన్నారు. ఈ కార్డులు అన్ని గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్డులు తీసుకొని ఆధార్‌కార్డు,పట్టాదార్ పాస్‌బుక్‌తో యూరియా విక్రయ కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ, ఆత్మకమిటీ డైరెక్టర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## ముత్యంరెడ్డికి ఘన నివాళులు

**తొగుట, జనవరి 1, ప్రభాతవార్త :** మాజీ మంత్రి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా పనిచేస్తామని తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డి(అమర్) అన్నారు. కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ముత్యంరెడ్డి 80వ జయంతి వేడుకలను నిర్వహించి తుక్కాపూర్‌లోని ఆయన స్మృతి వనంలో ఆయన విగ్రహానికి ముత్యంరెడ్డి సతీమణి విజయలక్ష్మీ, దుబ్బాక నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డితో కలిసి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయలక్ష్మీ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పార్టీ నాయకులు స్వామి, శోభాకొండల్‌రెడ్డి, గాంధారి లతనరేందర్‌రెడ్డి, జయమ్మ నర్సింలు, కళావతి స్వామి, రవీందర్,సత్తయ్య, రమేష్, భూపాల్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాంరెడ్డి, నరసింహ్మారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పార్టీశ్రేణులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**చిన్నకోడూరు, జనవరి 1, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన కూలీ నాగిబాబు ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లగా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ గంగ పర్శరాములకు అందించడంతో ఆయన గురువారం బాధిత కుటుంబీకులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని దహన సంస్కారాల కోసం ఆర్థిక సహాయం అందించినట్లు సర్పంచ్ గంగ పర్శరాములు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె నర్సింహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ మెట్ల శంకర్, మాజీ ఎంపిటిసి భూంపల్లి శ్రీనివాస్, ఎఫ్‌ఎ బాబు పాల్గొన్నారు.

## అనాధలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**చేర్యాల, జనవరి 1, ప్రభాతవార్త :** గడిచిన మూడు సంవత్సరాలుగా మండల వ్యాప్తంగా ఉన్న అనాధలు, వృద్ధులకు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ అండగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో గురువారం చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలోగల వృద్దులకు ఫౌండేషన్ అధ్యక్షులు జింకల పర్వతాల యాదవ్‌లు గ్రామంలో ఉన్న అనాధలతో పాటు వృద్దులకు 10 కిలోల బియ్యంతోపాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సహాయానికి ప్రజలు అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరెన్నో చేయాలని ఆకాంక్షించారు. నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన వారిలో అనిల్, చంద్రం, రాజబాబు, వినోద్, శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ఆత్మగౌరవ పోరాటం బీమా కోరేగావ్

### జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి



మాట్లాడుతున్న కేడం లింగమూర్తి

**హుస్నాబాద్ టౌన్, జనవరి 1, ప్రభాతవార్త :** అధికార, అహంకారులపై మహర్లు జరిపిన ఆత్మగౌరవ పోరాటమే బీమా కోరేగావ్ యుద్ధమని జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. 1818లో మహారాష్ట్రలోని భీమా కోరేగావ్‌లో పీష్వాలపై అల్పసంఖ్యాకులైన దళిత బహుజనులు జరిపిన ఆత్మాభిమాన పోరాటానికి గుర్తుగా గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మృత వీరులకు నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లింగమూర్తి మాట్లాడుతూ ఆనాటి భీమా కోరేగావ్ పోరాటం పేదలకు పెత్తందారులకు జరిగిన ఆత్మాభిమానానికి ప్రతీకఅని, వేలాది పీష్వా సైనికులపై 500 మంది అల్ప సంఖ్యాక మహర్లు ఆత్మాభిమానంతో పోరాడి వీరమరణం పొందాలని గుర్తు చేశారు. ఈరోజును డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ శౌర్య దినోత్సవంగా గుర్తిస్తూ తను జీవించి ఉన్నంతకాలం ఆ పవిత్ర ప్రదేశాన్ని క్రమం తప్పకుండా సందర్శించాడన్నారు. అగ్రవర్ణ, ఆధిపత్య, భావజాలానికి వ్యతిరేకంగా జరిగిన ఈ పోరు నేటి యువతరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, జన జాగృతి కళా సమితి అధ్యక్షులు సంపత్ కుమార్, ప్రజాసంఘాల నాయకులు కొయ్యడ కొమురయ్య, మేకల వీరన్న యాదవ్, ఎనగందుల శంకర్, చిత్తారి రవీందర్, వెన్న రాజు, కండె సుధాకర్, ఎండి హసన్, వేల్పుల రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ యూత్ అసోసియోషన్ అధ్యక్షుడిగా చిరంజీవి

**హుస్నాబాద్ రూరల్, జనవరి 1, ప్రభాతవార్త :** ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ కార్యవర్గ సమావేశాన్ని గురువారం రోజున హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షులుగా చొప్పరి చిరంజీవిని ఎన్నుకోవడంతో పాటు ఉపాధ్యక్షులుగా గుళ్ళ శ్రావణ్, ప్రధాన కార్యదర్శిగా బొల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా గందె చిరంజీవి, కోశాధికారిగా చామంతుల రమేష్, డైరెక్టర్లుగా మారుపాక శ్రీకాంత్, ఎర్రవెల్లి శ్రీకాంత్, మల్లం ప్రశాంత్, గంగరవేణి మధు, ఎర్రవెల్లి నవీన్, బోనగిరి రాజులను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



ముదిరాజ్ యూత్ అసోసియోషన్ నూతన పాలకవర్గం

# జిల్లాలో అంబరాన్నంటిన న్యూ ఇయర్ సంబరాలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/చిన్నకోడూరు/ నంగునూర్, జనవరి 1, ప్రభాతవార్త**

జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ నూతన సంవత్సరానికి స్వాగతంపలుకుతూ జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల పట్టణాలతో పాటు గ్రామాల్లో అర్ధరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాత్రి 12 గంటలకు నూతన సంవత్సరం ప్రారంభంకాగానే రోడ్లపైకి వచ్చి యువకులు కేరింతలు కొడుతూ హ్యాపీన్యూయర్ అంటూ బైక్‌లపై చక్కర్లు కొట్టారు. ఉదయం ప్రతి ఇంటి ముందు మహిళలు నూతన సంవత్సర శుబాకాంక్షలు తెలుపుతూ రంగురంగుల మగ్గులు వేసి స్వాగతం పలికారు.దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.సిద్దిపేట వేంకటేశ్వరాలయం, షిర్డీసాయి బాబా, శ్రీమహారేణుక ఎల్లమ్మ దేవాలయం, కోటిలింగాలు, వర్గల్ మండల పరిధిలోని నాచారం లక్ష్మీ నర్సింహస్వామి, సరస్వతి దేవాలయం, దుబ్బాకలోని వెంకటేశ్వరాలయం, కొమురవెల్లి మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంతో పాటు పలు ప్రముఖ దేవాలయాల్లో భక్తులు పెద్దఎత్తున్న పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

**నంగునూరులో...**

నంగునూరు మండలంలో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. నంగునూరు రామాలయం, కళ్యాణ వేంకటేశ్వరాలయం, నల్లపోచమ్మ దేవాలయం, కోనాయపల్లి వేంకటేశ్వరాలయం, అభయాంజనేయస్వామి, ముంద్రాయి షిర్డీసాయి బాబా, లక్ష్మినర్సింహస్వామి, అక్కెనపల్లి శివారు బుగ్గరాజేశ్వరస్వామి ఆలయం, ఖాత ప్రసిద్ద పురాతన శ్రీమహదేవస్వామి ఆలయం, నర్మెట్ట రామాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. యువకులు, విద్యార్థులు విందులు, వినోదాల్లో మునిగితేలుతూ ఆనందంగా నృత్యాలు చేశారు. నంగునూరు, గట్లమల్యాల, అక్కెనపల్లి, సిద్దన్నపేట, బద్దిపడగ, పాలమాకుల, రాంపూర్, మగ్దుంపూర్, నర్మెట్ట,రాజగోపాల్‌పేట, వెల్కటూర్, కోనాయపల్లి గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఆయా గ్రామాల నేతలు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలను తెలుపుకున్నారు.

**చిన్నకోడూరులో...**

చిన్నకోడూరు మండలంలో ఘనంగా నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. మండలంలోని అనంతసాగర్ సరస్వతి క్షేత్రానికి కొత్త సంవత్సరం రోజున భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశారు.

## నేటి నుంచి మోతీమాత జాతర

-హాజరుకానున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ



మోతీమాత ఆలయం దృశ్యం

**జహీరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:**
మొగుడంపల్లి మండల పరిధిలోని ఉప్పరిపల్లి తండాలో కొలువున్న గిరిజనుల ఆరాధ్యదైవం మోతీమాత ఉత్సవాలు ఈ నెల 2వ తారీఖు నుంచి ప్రారంభంకానున్నాయి. జాతరను పురస్కరించుకుని ఆయా ప్రాంతాల నుంచి చేరుకునే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కేసు సింగ్ రాథోడ్, పవన్ రాథోడ్‌లు పేర్కొన్నారు. ఉత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ, ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, సెట్విన్‌చైర్మన్ నందారం గిరిధర్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతున్నారన్నారు.

**పూర్తయిన ఏర్పాట్లు..**
జాతరకు అయా ప్రభుత్వశాఖల అధికారులు తగు ఏర్పాట్లు పూర్తిచేశారు. జాతరను పురస్కరించుకుని ఆర్‌డిఓ దేవుజ, డిఎస్‌పి సైదానాయలు ఆయాశాఖల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మెడికల్‌క్యాంప్‌ను ఏర్పాటుచేయాలని మొగుడంపల్లి పిహెచ్ ఆర్‌డిఓ సూచించారు. విద్యుత్, శానిటేషన్, వైద్య, ఆరోగ్యం, ఎక్సైజ్ తదితరశాఖల అధికారులు తమశాఖల తరపున నిర్వహించే పనులు పూర్తి చేయాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ధ్వజారోహణంతో ప్రారంభం అవుతాయన్నారు.

## మాజీ మంత్రికి భూపాల్‌రెడ్డి శుభాకాంక్షలు



హరీష్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న భూపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, జనవరి 1, ప్రభాతవార్త:**
మాజీమంత్రి, సిద్దిపేట బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును మాజీ ప్రోటెంచైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి, పటాన్‌చెరునియోజకవర్గ బిఆర్‌ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శరెడ్డిలు గురువారం హైద్రాబాద్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని నూతనసంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆకటా సునీతారాజేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతనసంవత్సరం 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, జిన్నారం మాజీ జడ్పిటిసి సభ్యులు బాల్‌రెడ్డి, నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, మాజీకౌన్సిలర్లు మాణిక్‌యాదవ్, యువనాయకులు మానిక్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు ఈఎస్ వెంకట్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహసీల్దార్‌కు విద్యార్థుల శుభాకాంక్షలు



డిప్యూటీ తహసీల్దార్‌కు హ్యాపీ న్యూఇయర్ చెబుతున్న విద్యార్థులు

**మనూర్, జనవరి 1, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మనూర్‌లోని సాంఘిక సంక్షేమ వసతిగృహం విద్యార్థులు మనూర్‌లోని ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకుని తాము స్వయంగావేసిన నూతనసంవత్సరం 2026 శుభాకాంక్షలు తెలిపే చిత్రపటాలను అధికారులకు (డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శకుమార్, మండల పరిషత్, పోలీసు అధికారులకు) అందించి నూతనసంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యలకు గ్రీటింగ్ కార్డులు పంపించి హ్యాపీ న్యూ ఇయర్ తెలిపినట్లు వసతిగృహం వార్డెన్ రాజిరెడ్డి, అంబోజి, విద్యార్థులు తెలిపారు.

## బాలుర వసతి గృహంలో నూతన సంవత్సర వేడుకలు




కేక్ కట్ చేస్తున్న నాయకులు, హాస్టల్ వార్డెన్

**గుమ్మడిదల, జనవరి 1, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో నూతన సంవత్సర వేడుకలను మున్సిపాలిటీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వసతిగృహంలో ఉన్న విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. వేడుకల్లో పాల్గొన్న మున్సిపాలిటీ నాయకులు విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బాలురతో ఆత్మీయంగా మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు, ఉత్సాహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో గుమ్మడిదల మాజీసర్పంచ్ మండలి తులసీదాస్, హాస్టల్ వార్డెన్ రవికుమార్, వసతిగృహ సిబ్బంది, స్థానిక నాయకులు, విద్యార్థులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలకు ఇందిరమ్మ చీరెల పంపిణీ

**నారాయణఖేడ్, జనవరి 1, ప్రభాతవార్త:**
మాధ్వార్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ బేగరి స్వరూప సంజీవులు, ఉపసర్పంచ్ పులకంటి మహేశ్వరి, వార్డ్‌మెంబర్ల ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. మహిళాసంఘాల లబ్దిదారులకు ఇందిరమ్మ చీరెలు అందించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు పిట్ల శివరాజ్, ఐకెపి విఓఎ పడిగే గోపాల్, మచ్‌కురి శంకర్, మచ్చందర్, మచుకురీ మారుతి, కొవ్వురు రాములు, దస్తాగౌడ్, బేగరీ లింగయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరెలను పంపిణీచేసిన సర్పంచ్

**కల్హేర్, జనవరి 1, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ చీరలను గ్రామ సర్పంచ్ కుర్మ సాయిలు డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్న వెంకటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కిష్టాగౌడ్, మాజీ మండల అధ్యక్షులు నారరాయణ్‌రావు, రేషన్ డీలర్ ఆగంగౌడ్, విఓఏ శ్రీనివాస్, నాయకులు అంజిరెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్రైడెంట్ కార్మికులకు న్యాయం చేయాలి

-డిసీఎల్‌కు ట్రైడెంట్ కంపెనీ కార్మికుల వినతి




ట్రైడెంట్ కంపెనీ ముందు ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

**జహీరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:**
ట్రైడెంట్ చక్కర కర్మాగారంలో ఇంతవరకు పని చేసిన కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే ఇప్పించాలని గురువారం కంపెనీ కార్మిక సంఘం అధ్యక్షులు ఎంజి రాములుయాదవ్ ఆధ్వర్యంలో డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు కార్మికులు వినతిపత్రం అందచేశారు.
ఈసందర్భంగా రాములు యాదవ్ మాట్లాడుతూ కర్మాగారంలో గత 30 సంవత్సరాలుగా పనిచేసిన కార్మికులకు గత మూడుసంవత్సరాలుగా కంపెనీ మూతపడటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కంపెనీ మూతపడే వరకు పని చేసిన కార్మికులకు 11నెలల వేతనాలు ఎల్‌ఐసి, పిఎఫ్ గ్రాడ్యుటీలతో పాటు కంపెనీ లే అవుట్ పీరియడ్ ఏడునెలల జీతాలు ఇతర అలవెన్స్‌లు, డబ్బులు రావాల్సి ఉందన్నారు. కంపెనీని మహారాష్ట్రకు చెందిన ఓంకార్ షుగర్ ఫ్యాక్టరీ కొనుగోలు చేసిందని, ప్రస్తుతం యాజమాన్యం స్థానిక అధికారులకుగాని, పోలీసులకుగాని, ఇదివరకు పనిచేసిన కార్మికులకుగాని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల నుంచి లేబర్‌ను తీసుకువచ్చి కంపెనీలో పనులు చేయిస్తున్నారన్నారు. పాత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రెవెన్యూ సిబ్బంది



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**నారాయణఖేడ్, జనవరి 1, ప్రభాతవార్త:**
2026 ఆంగ్ల నూతనసంవత్సరాన్ని పురస్కరించుకొని డిప్యూటీ తహసీల్దార్ రాజు పాటిల్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆయన స్వగృహంలో ఎమ్మెల్యేను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కోరారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ముందుకుసాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఈశ్వర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మాధవ రెడ్డి, సర్వేయర్ మల్లేశం, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్, రాజు, దినకర్, రాజు, ఆపరేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## వలస కార్మికుల పిల్లలను పాఠశాలలో చేర్పిస్తాం

**సిర్గాపూర్, జనవరి 1, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో పరిసరాల్లో ఇసుక బట్టీలో పనులు చేస్తున్న వలస కార్మిక కూలీల పిల్లలను గుర్తించి సుల్తానాబాద్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించేందుకు చర్యలుతీసుకుంటామని సిఆర్‌పి తెలిపారు. పని ప్రదేశంనుంచి పిల్లలను పాఠశాలకు రానుపోను ఆటోను ఏర్పాటు చేయటానికి ఇసుకబట్టీ యజమాని తెలిపినట్లు సిఆర్‌పి పేర్కొన్నారు.

## కెటిఆర్‌ను కలిసిన శశిధర్‌రెడ్డి



కెటిఆర్‌ను కలిసిన శశిధర్‌రెడ్డి

**పాపన్నపేట, జనవరి 1, ప్రభాతవార్త:**
బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి గురువారం కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పలువిషయలపై ఇరువురు చర్చించుకున్నారు.

## షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

**నారాయణఖేడ్, జనవరి 1 ప్రభాతవార్త:**
షి టీం, మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కెజిబివి నాగలిగిద్ద, నారాయణఖేడ్‌లో బేటీ బచావో బేటీ పడావో, అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగింది. కార్యక్రమంలో షీ టీం ఎఎస్ఐ తులసీరామ్ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించడం జరిగింది. మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్షియల్ స్పెషలిస్ట్ పి.నర్సింలు, షీ టీం అధికారి చాంగ్‌భాయి మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో అవగాహన, బాలిక విద్య, బాల్యవివాహ నిషేధ చట్టం ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి స్పెషల్ ఆఫీసర్ సురేఖ, షీ టీం అధికారి చాంగ్‌భాయి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రులను కలిసిన మాజీ ఎమ్మెల్యే



మాజీమంత్రి హరీష్‌రావును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, జనవరి 1, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎన్నికైన సందర్భంగా వారిని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం. భారత రాష్ట్ర సమితి పార్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావును మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వారితోపాటు నారాయణఖేడ్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఆర్టీసి డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవిఐ వెంకటయ్య

**జహీరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త:**
జహీరాబాద్ ఆర్టీసి డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను జనవరి 1వ తారీఖు నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంవిఐ వెంకటయ్య పేర్కొన్నారు. మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన కల్పిస్తారు. కార్యక్రమంలో భాగంగా మొదటిరోజైన గురువారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం.వెంకటయ్య హాజరై కార్యక్రమం నిరంతర ప్రక్రియ అన్నారు. ఈసందర్భంగా చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటుచేసిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ టి.స్వామి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## 2వ సాధారణ ఎన్నికల డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా



ఎన్నికల డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను చూపెడుతున్న మున్సిపల్ అధికారులు

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 1, ప్రభాతవార్త:**
రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు రామాయంపేట మున్సిపాలిటీ 2వ సాధారణ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ కమిషనర్ దేవేందర్, మేనేజర్ రఘువరన్, టిపిఓ దేవరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో 1 నుండి 12 వార్డుల డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు, వార్డ్ ఆఫీసర్లు, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొని, ఓటర్ల జాబితా నిర్వహణలో సహకరించారు. మున్సిపాలిటీ ప్రజలు తమ పేర్లు జాబితాలో సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించవలసి ఉంటుంది.

# వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

-జయంతి సందర్భంగా సిజిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా ఉత్సవాలు
-ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి



క్రీడాస్థలాన్ని పరిశీలిస్తున్న చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

**గుమ్మడిదల, జనవరి 1, ప్రభాతవార్త:**
స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్‌ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జనవరి 12న జరగనున్న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని సిజిఆర్ క్యాంపు కార్యాలయంలో ట్రస్ట్‌సభ్యులతో చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, వివేకానంద ఆశయాలను ప్రతిష్ఠించేందుకు జనవరి 10,11,12 తేదీలలో గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం ఆయన ఆ పాఠశాల క్రీడామైదానాన్ని స్వయంగా పరిశీలించారు. క్రీడాకారులు, యువత, స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.కృష్ణ, పిఈటి, కబడ్డీ కోచ్ అమ్మగారి విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, యాదిరెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, పి.శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, కరుణాకర్‌గౌడ్, చంద్రారెడ్డి, జయపాల్‌రెడ్డి, నర్సింలు, సత్యం ముదిరాజ్, సాయిగౌడ్, సాయి యాదవ్, బాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## సోమేశ్వరుడిని దర్శించుకున్న కార్పొరేటర్

**రామచంద్రాపురం, జనవరి 1, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో కొలువున్న సోమేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం కార్పొరేటర్ పుష్పనగేష్ సందర్శించుకుని స్వామివారికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. జనవరి 10,11,12 తేదీలలో జరుగనున్న ఉత్సవాలను పురస్కరించుకుని కొనసాగుతున్న పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఆలయంవద్ద అడ్డంగా ఉన్న స్తంభాన్ని స్వంత నిధులతో రెండు రోజుల్లో తొలగించి భక్తులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆలయ, యాదవ సంఘం అధ్యక్షులు రాగం రమేష్‌యాదవ్, బైకాన్ సాయిలుయాదవ్, రాములమ్మ, రాగం కృష్ణ యాదవ్, ఈశ్వర్‌పంతులు, బైకన్ సోమేష్‌యాదవ్, ప్రభుయాదవ్, వనం చిన్నయాదవ్, లక్ష్మీనారాయణ, వీరేష్‌యాదవ్, సోమయ్య యాదవ్, కృష్ణయాదవ్, బల్ల నర్సింగ్‌రరావు, ధనసిరి ప్రకాష్, చాకలి నర్సింహ, కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి



ఎస్‌ఆర్ ట్రస్ట్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అంజిరెడ్డి

**రామచంద్రాపురం, జనవరి 1, ప్రభాతవార్త:**
రామచంద్రాపురంలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి ఎస్‌ఆర్ ట్రస్ట్ రూపొందించిన నూతనసంవత్సరం 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ కొత్తసంవత్సరంలో ప్రతి ఒక్కరు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో జీవించేలా కరుణించాలని పంచముఖ ఆంజనేయస్వామిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## చైర్మన్ సాయిలును పరామర్శించిన మచ్చేందర్

**కల్హేర్, జనవరి 1, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఫతేపూర్ గ్రామానికి చెందిన నల్లవాగు ప్రాజెక్టు నీటి సంఘం చైర్మన్ సాయిలు కంటికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుసుకున్న జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్‌ఎస్ నాయకులు గుట్టపు మచ్చేందర్ సాయలు నివాసానికి చేరుకుని పమర్శించి కుటుంబ సభ్యులకు ధైరం చెప్పారు. కార్యక్రమంలో కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు ఆకుల రాములు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో నట్టల నివారణ మందులు

-జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు వసంతకుమారి

**చౌటకూరు, జనవరి 1, ప్రభాతవార్త:**
మూగజీవాలు ఆరోగ్యంగా ఎదిగేందుకు నట్టల నివారణ మందును విధిగా తాగించాలని జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు వసంతకుమారి అన్నారు. మండలపరిధిలోని ఉప్పరిగూడెంలో మేకలకు నట్టలనివారణ మందు తాగించే కార్యక్రమం నిర్వహించారు. ఉప్పరిగూడెంలో ఒకేరోజు 255జీవాలకు మందును తాగించామన్నారు. మండలంలో 7వేలకు పైగా జీవాలకు మందును తాగించామన్నారు. డిసెంబరు 22 నుంచి 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 4లక్షల11వేల 793 జీవాలకు మందును తాగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్ల మల్లేశం, మండల పశువైద్యాధికారి డాక్టర్ విశాల్‌కుమార, సిబ్బంది ప్రభాకర్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్న పలు చర్చిలు



చర్చిలో ప్రార్థన నిర్వహిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, జనవరి 1, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో నూతన సంవత్సర దినోత్సవాన్ని పురస్కరించుకొని పలుచర్చిల్లో ప్రత్యేక ప్రార్థనాకార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గతంలో గడిచిన కాలాన్ని స్మరించుకుంటూ, నూతన సంవత్సరంలో ప్రజలందరికీ ఆ దేవుడు శాంతి, ఆరోగ్యం, సుఖసమృద్ధి ప్రసాదించాలని ప్రార్థనలు చేశారు. విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేకప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమాలు స్థానికపాస్టర్లు దినకర్, మాథ్యూకుట్టి, ఆధ్వర్యంలో నిర్వహించగా, పరస్పర ప్రేమ, సహనం, ఐక్యతతో జీవించాలని వారు పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## నూతన సంవత్సరవేళ.. ఏడుపాయలలో భక్తజన సందోహం



దర్శనం కోసం క్యూలైన్‌లలో వేచి ఉన్న భక్తులు

**పాపన్నపేట, జనవరి 1, ప్రభాతవార్త:**
ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకొని ఏడుపాయల వనదుర్గమ్మ సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. పాత సంవత్సరానికి వీడుకోలు పలుకుతూ, నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు భక్తులు. ఈసందర్భంగా పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి చేరుకున్న భక్తులు నూతన సంవత్సరంలో మంచి జరగాలని అమ్మవారిని మొక్కుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా వేద పండితులు అమ్మవారిని ప్రత్యేకపూలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఏడుపాయల రాజగోపురం ప్రాంతం నుండి అమ్మవారి ఆలయం వరకు భక్తులు పెద్దసంఖ్యలో చేరుకోవడంతో చిన్నపాటి జాతరను తలపించింది ఏడుపాయల. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్‌తోపాటు ఆలయ సిబ్బంది భక్తులకు తగిన ఏర్పాట్లుచేశారు.

## ఊరూరా నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటిని అర్ధరాత్రి సంబరాలు

**పుల్‌కల్, జనవరి 1, ప్రభాతవార్త:**
ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం అర్థరాత్రి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రాత్రి 12 గంటలు దాటగానే టపాసులు కాలుస్తూ కేక్‌లు కట్ చేస్తూ యువత కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికి, 2025 సంవత్సరానికి వీడ్కోలు పలికారు. గురువారం ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులతో అందంగా వాకిళ్లను ముస్తాబుచేశారు.